క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న పూజారులు పాల్గొన్న భక్తులు

పీసీపల్లి(సీఎస్‌పురం): ప్రముఖ పుణ్యక్షేత్రమైన నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, అర్చన, మహా నివేదన, గో పూజ, పల్లకీసేవ పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు చేతబూని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మండల సమావేశం

హనుమంతునిపాడు: మండల సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందజేత



విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందిస్తున్న దాతలు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో పదవతరగతి విద్యార్థులకు దాతలు ప్యాడ్‌లు, పెన్నులు అందచేశారు. ఉలవపాడుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులు 15 మంది విద్యార్థినులకు ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు.

4న ఆసరా చెక్కుల పంపిణీ

ఉలవపాడు: ఉలవపాడులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద ఈ నెల 4న ఆసరా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం నవీన్ తెలిపారు. సాయంత్రం 3.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి హాజరవుతారన్నారు. మండల పరిధిలోని గ్రూపు మహిళలు హాజరుకావాలన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వల్లూరమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించారు.

మసీదులు, షాదీఖానాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



ఇఫ్తార్ విందులో దువాలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా, నాయకులు

పామూరు: మండలంలోని మసీదులు, షాదీఖానా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పామూరులో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్ చాంద్‌బాషా, 4వ ఎంపీటీసీ సభ్యుడు షేక్.అబ్దుల్‌లు ఆదివారం స్థానిక విరువూరురోడ్డు పెద్దమసీదు సమీపంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లింలతో కలిసి దువా (ప్రార్థన) నిర్వహించి ఇఫ్తార్ విందు ఆరగించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ దరిశి రాము, కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, యాదాల వెంకట సాయికిరణ్, కోఆప్షన్ నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సచివాలయ కన్వీనర్ ఖాదర్‌బాషా, షేక్.హాజీగౌస్, జి.వెంకటేశ్వరరెడ్డి, మంచికంటి మధు, కొత్తూరి రవిబాబు, చెనికల శ్రీను, సలీం, గుర్రం వెంకటేశ్వర్లు, చల్లా సుబ్బారావు, సునీల్, నారాయణరెడ్డి, సూరి, సుబ్రహ్మణ్యం, గాజులపల్లి శ్రీనివాసరెడ్డి, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లకు అడ్డేది..?

- పట్టణంలో అనుమతులు లేకుండా వెలుస్తున్న అనధికార లేఅవుట్లు
- గుట్టుచప్పుడు కాకుండా ప్లాట్ల విక్రయం
- పట్టించుకోని అధికారులు



60 అడుగుల రోడ్డులో వ్యవసాయ భూముల్లో వేసిన లేఅవుట్

కందుకూరు: మున్సిపాలిటీ పరిధిలో అనధికార రియల్ ఎస్టేట్ వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇటీవల వరకు కొంత స్తబ్ధుగా ఉన్న రియల్ దందా తిరిగి పుంజుకుంటుంది. గుట్టుచప్పుడు కాకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించి చేతుల దులుపుకుంటున్నారు. అనుమతులు లేని లేఅవుట్లో ప్లాట్లు కొన్న లబ్ధిదారులు తరువాత మున్సిపాలిటీ అనుమతుల పేరుతో భారీగా భారం పడుతుంది. అదే సందర్భంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతుంది. అయినా మున్సిపల్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విచ్చలవిడిగా లేఅవుట్లు

మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలంలో రియల్ వ్యాపారులు అక్రమ వ్యాపారాన్ని జోరుగా విస్తరిస్తున్నారు. వీరి వ్యాపారానికి అధికారుల అండదండలు సంపూర్ణంగా ఉండడంతో ఈ రియల్ దందాకు అడ్డే లేకుండా పోతుంది. పట్టణంలో ఇటీవల కాలంలో వెలుస్తున్న అక్రమ వెంచర్లే ఇందుకు నిదర్శనం. మున్సిపాలిటీ పరిధిలోని మహదేవపురం రోడ్డులో పంచాయతీ పరిధిలోకి వచ్చే భూముల్లో కొందరు వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వెంచర్‌ను వేశారు. అలాగే 60 అడుగుల రోడ్డు చివరి ప్రాంతంలో వ్యవసాయ భూముల్లో భారీ వెంచర్ వెలిసింది. అలాగే పోతురాజు మిట్ట ప్రాంతంలో, ఉప్పుచెరువులో ఈ అక్రమ వెంచర్లు ఇటీవల వెలిశాయి. ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి భారీ ధరలు నిర్ణయించి చేతులు దులుపుకుంటున్నాయి. ప్రాంతంలో గదుల లెక్కన ప్లాట్లు వేసి ధరలు నిర్ణయిస్తున్నారు. గది రూ.20 వేల నుంచి రూ.50వేల వరకు ధరలు నిర్ణయించుకుని మోసాలకు పాల్పడుతున్నారు. సెంట్ రూ.3 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. రియల్ వ్యాపారుల మాయలో పడుతున్న అమాయకులు అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి బలవుతున్నాయి.



మహదేవపురం రోడ్డు సమీపంలో వేస్తున్న లేఅవుట్



పోతురాజుమిట్ట ప్రాంతంలో వెలిసిన లేఅవుట్

మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి

మున్సిపాలిటీ పరిధిలో లేఅవుట్లు వేయాలంటే ప్రస్తుతం నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ నుంచి డీటీపీసీ అనుమతులు పొందాల్సి ఉంటుంది. మొదటగా వ్యవసాయ భూములైతే వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు రెవెన్యూ నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. ఆ తరువాత రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకునేందుకు నుడా అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం విశాలమైన రోడ్లు, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ ఇలా అన్నీ మౌలిక వసతులు ఉంటేగాని లేఅవుట్లకు నుడా నుంచి అనుమతులు రావు. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోని రియల్ వ్యాపారులు నేరుగా లేఅవుట్లు వేస్తున్నారు. మాయ మాటలు చెప్పి ప్లాట్లు విక్రయించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతుంది. ఈ వ్యవహారం ఇటీవల కాలంలో మున్సిపాలిటీలో జోరుగా సాగుతుంది. అయినా మున్సిపాలిటీ అధికారులు ఆ వెంచర్ల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్రమ లేఅవుట్లలో రియల్ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుంది.

కొన్నవారికి భారీ వడ్డింపు

ఎటువంటి అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులు తరువాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే అన్ని నిబంధనలు ఉంటేనే అనుమతులు ఇస్తామని, నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లంచాలని చెప్తున్నారు. తరువాత లేఅవుట్ డెవలప్‌మెంట్ చార్జీలు, రోడ్ల విస్తీర్ణానికి భూమి వదలడం వంటి నిబంధనలు ఇంటి ప్లాన్‌కు దరఖాస్తు చేసుకున్న సమయంలో అధికారులు చెప్తున్నారు. దీంతో లక్షల్లో అనుమతుల కోసం ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. అక్రమ లేఅవుట్‌లను వేసే సమయంలోనే అడ్డుకుంటే మోసపోం కదా అంటే కొందరు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి

కొండపి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పొదిలి రోడ్డులోని కళ్యాణ మండపంలో 'మా నమ్మకం నీవే జగనన్న' కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ.. మా నమ్మకం నీవే జగన్ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వేముల వెంకటప్రసాద్, రావులపల్లి కోటరాజు, సచివాలయాల మండల కన్వీనర్ గొట్టిపాటి మురళి, ఆరికట్ల కోట్లింగయ్య, హరినారాయణ, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎం.గోవిందుకృష్ణమూర్తి, మోపర్తి నారాయణ, బచ్చల కోటేశ్వరరావు, నరాల చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



కొండపి : మాట్లాడుతున్న మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు



సింగరాయకొండ : మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ సుబ్బారావు

■ **సింగరాయకొండ:** వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై గ్రామ సచివాలయ కన్వీనర్లతో వర్క్‌షాప్ నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ మాట్లాడుతూ.. గృహసారథులు, గ్రామ వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి వారికి కలిగిన లబ్ధిని వివరించాలని సూచించారు.

■ జరుగుమల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, సీనియర్ నాయకులు బెల్లం సత్యన్నారాయణ, గ్రామ సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భైరవకోనలో భక్తుల సందడి

పీసీపల్లి(సీఎస్‌పురం): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. విద్యార్థులు భారీగా భైరవకోనకు విచ్చేశారు. అక్కడి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకటనర్సయ్య, పంచాగ్నుల రామమూర్తిశర్మ, సుధాకర్‌శర్మలు ఆలయాల్లో పూజలు చేశారు. బాపట్ల జిల్లా బట్టిప్రోలు గ్రామానికి చెందిన ఉద్దంటి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఉద్దంటి బాలకృష్ణ, లీలావతి దంపతులు భైరవకోన ఆలయ అభివృద్ధికి రూ.10,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్ధు రమణారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు.



భైరవకోన ఆలయాల్లో పూజలు చేస్తున్న భక్తులు

నరసింహస్వామి ఆలయంలో రూ.24 లక్షలతో అభివృద్ధి పనులు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దాతల సహకారంతో సుమారు రూ.24 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నూతన ధ్వజ స్తంభం నిర్మాణానికి తెనాలికి చెందిన దాత దాసరి కృష్ణకుమార్ రూ.7 లక్షలు, వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో రేకుల షెడ్ నిర్మాణానికి సోమరాజుపల్లికి చెందిన యన్నాబత్తిన కార్తీక్ యాదవ్ రూ.17 లక్షల ఆర్థిక సహకారం అందిస్తున్నారని వివరించారు.

పేదలకు న్యాయ సేవలందిస్తాం

కనిగిరి రూరల్: అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండి సముచిత న్యాయం అందిచేందుకు కృషి చేస్తామని న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య అన్నారు. స్థానిక ఎంజీఆర్ కళ్యాణ మండపంలో నూతన బార్ అసోసియేషన్ కమిటీని బీసీ సంక్షేమ సంఘం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్య పరిష్కారంలో బార్ అసోసియేషన్ కమిటీ చేసే ప్రయత్నానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, బీసీ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ నాయబ్ రసూల్, ఈర్ల విజయరామ రాజు, పల్లా మాలకొండయ్య, బీటీపీ రాష్ట్ర నాయకులు దద్దాల శ్రీనివాసుల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీనీ సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఘనంగా మట్టల ఆదివారం

పొన్నలూరు: స్థానిక బాప్టిస్టు నగర్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారంను ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ చిన్నారులు రంగు రంగుల పూలతో అలంకరించిన ఈత మట్టలను ప్రధాన రహదారుల్లో ప్రదర్శిస్తూ ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ చుండి ప్రభాకర్, విశ్వాసులు పాల్గొన్నారు.

మద్దిపాడులో చీరలు పంపిణీ

మద్రిపూడి: మట్టల ఆదివారం సందర్భంగా స్థానిక జెరుసా ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులు, వితంతువులకు పాస్టర్ స్టీఫెన్ చీరలు పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్‌లో ఈతమట్టలతో చిన్నారులు మానవహారంగా ఏర్పడి క్రీస్తు గీతాలు ఆలపించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కనిగిరి రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్‌లోని సీనియర్ సభ్యుడైన కోటపాటి మనోహర్‌రెడ్డి ఇటీవల నరసారావుపేటలో జరిగిన 65 ప్లస్ లాన్ టెన్నిస్ టీంలో ఆడి ప్రథమస్థానంలో నిలిచి, కప్పు గెలిచినందుకు ఆదివారం కాస్మోపాలిటన్ క్లబ్, లాన్ టెన్నిస్ టీం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ముత్యాల శ్రీనివాసులరెడ్డి, సిరువ గోవర్ధన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అల్లూరి సత్యనారాయణ, రంగబాబు, ప్రకాష్‌రావు, చీమలమర్రి ప్రసాద్‌రావు, దేవరపు మూర్తి, న్యాయవాది సుమైర్ క్రీడాకారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ నాయకులు

అణగారిన వర్గాల హక్కుల ప్రదాత అంబేడ్కర్

కందుకూరు అర్బన్: భారతరత్న డాక్టరు బీఆర్ అంబేద్కర్ 132వ జయంత్సోవాల సందర్భంగా ఆదివారం ఓగూరు యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు హక్కులు కల్పించిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మనోహర్, ఏడుకొండలు, వెంకటరావు, మధుబాబు, శ్రీను, తిరుపతి,కోటేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, గాండ్ల హరిప్రసాద్, రవికుమార్, నరేష్, శరత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

పీసీపల్లి: మండలంలో మెరుపులు, ఉరుములతో వర్షం కురిసింది. గాలి వానకు చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగి పడ్డాయి. మండల పరిధిలోని పీసీపల్లి, వరెల్ల, జంగాలపల్లిలో కురిసిన గాలి వానకు చెట్లు కూలిపోయాడు. జంగాలపల్లిలో 3 విద్యుత్ స్తంభాలు కూలడంతో కరెంట్ వైర్లు తెగిపోయాయి. దీంతో గ్రామాల్లో అందకారం నెలకొంది. వెంగళాయపల్లిలో పిడుగు పడి కరణం శ్రీనుకు చెందిన రూ.75 వేల విలువైన గేదె మృతి చెందింది.



జంగాలపల్లిలో విరిగిన కరెంట్ స్తంభం

పది పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హనుమంతునిపాడు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.పెద్దిరాజు మాట్లాడుతూ మహమ్మదాపురంలోని జిల్లా పరిషత్ పరీక్ష కేంద్రంలో 136 మంది, డల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 170 మంది బాల బాలికలు పరీక్షలు హాజరవుతారన్నారు. రెండు కేంద్రాల్లో 306 మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు. హనుమంతునిపాడు కేంద్రంలో పరీక్ష ఛీఫ్‌గా రమేష్, పార్టుమెంటల్ ఆఫీసర్‌గా కె.రమణయ్య, మహమ్మదాపురం పరీక్ష కేంద్రంలో పరీక్షల చీఫ్‌గా టి.పెద్దిరెడ్డి, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా హరికృష్ణలను నియమించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ జె.ప్రసాదరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రత్నం జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని సీఎస్‌పురం, అంబవరం, డీజీపేట, నల్లమడుగుల, శీలంవారిపల్లి, అరివేముల, సి.నాగులవరం, పెదరాజుపాలెం, కేజీబీవీ పాఠశాలలకు చెందిన 343 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 210 మంది, రత్నం జూనియర్ కాలేజీలో 133 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. రెండు పరీక్షా కేంద్రాలకు 16 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వెలిగండ్ల: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ దాసుప్రసాద్ తెలిపారు. వెలిగండ్ల జెడ్పీ హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, కస్తూరిబా బాలికల పాఠశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఏ సెంటర్‌లో 141 మంది, బి సెంటర్‌లో 141 మంది, కస్తూరిబా పాఠశాల సెంటర్‌లో 95 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

పీసీపల్లి: పదోతరగతి పరీక్షలకు అన్ని రకాలు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈఓ దాసు ప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 3 సెంటర్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ హెచ్‌ఎస్ హైస్కూల్‌లో 221 మంది, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 99 మంది, కస్తూరిబా పాఠశాలలో 92 మంది మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

కనిగిరి రూరల్: పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ షమలు చేస్తున్నట్లు కనిగిరి సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కనిగిరి సర్కిల్ పరిధిలోని కనిగిరి, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు మండలాల పరిధిలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలుండగా, కనిగిరి పట్టణంలోని 6, రూరల్‌లో 2 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని, విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరాలన్నారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఎటువంటి జెరాక్స్, డీటీపీ, కంప్యూటర్ కేంద్రాలకు అనుమతి లేదన్నారు. పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఉండవద్దని సూచించారు. ఎస్సై దాసరి ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శివరామకృష్ణారెడ్డి

పామూరు: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీఐ కాటూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో వ్యాపార సముదాయాలకు, జెరాక్స్, కంప్యూటర్ సెంటర్లను తీసి ఉంచరాదన్నారు. పరీక్షలు నిర్వహించే సిబ్బంది తప్ప ఎవ్వరికీ పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. మండలంలోని 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 715 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా వీరిలో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 140, శ్రీచైతన్య కేంద్రంలో 138, ఈటీఎస్‌అండ్‌ఎల్ కేంద్రంలో 149, వివేకా బాయ్స్ కేంద్రంలో 150, బొట్లగూడూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 138 మంది విద్యార్థులను కేటాయించారు. కేంద్రాలను సీఎస్, డీఓలు పర్యవేక్షించనున్నారు.

పీసీపల్లి: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. పరీక్ష కేంద్రం చుట్టుపక్కల ఎవ్వరూ కనిపించరాదన్నారు. పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లు తప్ప అదనపు సిబ్బంది ఉండకూడదన్నారు. ఎవరైనా పోలీసు నియమాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

..ఆల్ ది బెస్ట్!

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కొండపి: పదో తరగతి పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కొండపిలో నాలుగు కేంద్రాల్లో 562 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ సురేఖ ఆదివారం తెలిపారు. విద్యార్థులను 8.45 గంటల నుంచి సెంటర్‌లోకి అనుమతిస్తామని 9.30 గంటలకు పరీక్ష మొదలవుతుందని చెప్పారు. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప ఒక్క నిమిషం ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి వచ్చినా అనుమతిచ్చేది లేదని, విద్యార్థులు సరైన సమయానికి రావాలని స్పష్టం చేశారు. స్థానిక సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై రమణయ్య పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

■ **సింగరాయకొండ:** మండల కేంద్రంలో నాలుగు సెంటర్లలో 800 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈఓ బి.శివన్నారాయణ తెలిపారు. ఆదివారం ఎంఈఓ కార్యాలయంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు.

■ జరుగుమల్లి మండలంలో రెండు సెంటర్లలో 375 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసన్ తెలిపారు.

■ **పొన్నలూరు:** మండల కేంద్రంలో రెండు, విప్పగుంట జెడ్పీ హైస్కూల్లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రవిచంద్రబాబు తెలిపారు. మొత్తం 3 కేంద్రాల్లో 359 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కొండపి సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

■ **మద్రిపూడి:** మండల కేంద్రంలో రెండు, రావిళ్లవారిపాలెంలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఈవీ రంగయ్య తెలిపారు. 3 కేంద్రాల్లో 358 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.



కొండపి స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రమణయ్య



సింగరాయకొండ : పరీక్షల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎంఈఓ శివన్నారాయణ

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కనిగిరి రూరల్: మండలంలోని యడవల్లిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిక్కిలి కాశయ్య కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు రూ. 70 వేల ఆర్థిక సాయం అందించినట్లు ఎంపీటీసీ వట్టి వేళ్ల రంగబాబు తెలిపారు. దాతలు ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ రూ.20 వేలు, వి.రంగబాబు రూ. 10వేలు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాసుల పెదగురవయ్య రూ.10వేలు, మాజీ సర్పంచ్ అల్లాటిపల్లి శివశంకర్‌రెడ్డి రూ.10 వేలు, కాసుల బాలయ్య రూ.5వేలు, మరి కొందరు దాతల ఆర్థిక సాయంతో మృతుని కుటుంబీకులకు ఆదివారం రూ.70వేల నగదును అందచేశారు.



నగదు ఇస్తున్న డాక్టర్ పెరుగుమురళీ కృష్ణ, రంగబాబు, కాసుల గురవయ్య